**ఆ భక్తవత్సలం అందనికొమ్మ. కనిపించని దేముడు. ఎప్పుడైనా దూరం నుంచి కనిపిస్తూ ఉంటాడు. అంతదూరంలోనూ ఆమె గమనించ గలుగుతూనే ఉంది అతడి కళ్లలోని చిన్న నీటిపొరను! అందువల్ల ... లాభం ?**

# ప్రవాసం

## రాచకొండ దశరథరామయ్య



"తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా - తందనాన

లయ బద్ధమైన తూగు. సూత్రబద్ధమైన మృదంగ ధ్వని. ఏకీకృతమైన గొంతులు.

దీర్ఘ వృత్తాకారంలో కట్టిన హాలులో బాల బాలికలు సమావేశ మయ్యారు. వరుసలు వరుసలుగా బల్లలు. బల్లల మీద పెద్దలూ, పెద్ద తరగతి పిల్లలూ కూర్చున్నారు. బల్లలకూ, వేదికకూ మధ్య తివాచీలు పరిచారు. ఆ తివాచీల మీద బాసింపట్లు వేసుక్కూర్చున్నారు చిన్న పిల్లలు.

వేదిక మీద ఒక మార్దంగికుడూ, నలుగురు పెద్ద తరగతి ఆడ పిల్లలూ, ఇద్దరు విద్యార్థులూ కూర్చున్నారు.

పల్లవీ, పల్లవితోబాటు ఢమకు ఢమకు మంటూ మృదంగం పలికే సంగతీ!, విద్యార్థినీ విద్యార్థుల్లో అనిర్వచనీయమైన భావ పరంపరా... వీటికి తగినట్టు చుట్టూ నిశ్శబ్దంగా తలలూపే చెట్లూ, గుసగుసలు వినిపించని పొదలూ, రాగతాళ ధ్వనులతో మూర్ఛనలు పోయిన పక్షులూ, కీటకాలూ.

"బ్రహ్మ మొకటె పర బ్రహ్మమొకటె పర
బ్రహ్మ మొకటె పర బ్రహ్మ మొకటే"

అందరి కంటే వెనుక బల్ల మీద కూర్చుంది ఆమె. హాలులో శబ్ద ప్రవాహం నర్తిస్తోంది. ఆ ప్రవాహానికి మృదంగపు దరువు సొబగు కూర్చుతుంటే ఆమె వింటోంది. మెదడూ, కళ్ళూ, చెవులూ ఆ ప్రవాహానికి అప్పగించి ఆస్వాదానుభూతితో ఆమె ఆ ప్రవాహంలో కొట్టుకుపోతోంది.

చిన్నపాటి గుండ్రాళ్ళ మీద చప్పుడు కాకుండా పారుతూన్న సెలయేటి నడక లాగా, చిగురు టాకుల మధ్య నుంచి గుసగుసల వీవనల పిల్ల తెమ్మెరలాగా ప్రకృతిలో చైతన్యరవళిలాగా కీర్తన మనస్సులను తాకుతోంది.

భక్తి పారవశ్యమో, ప్రకృతిలో తాదాత్మ్యమో, జీవితం తాలూకు తాత్త్విక చింతన పరాకాష్ఠో అన్నమయ్యను తన్మయపరచి ఆయనను కవిని చేసి ఉండాలి.

హుఁ! బ్రహ్మ మొకటే... ఆడది మెచ్చుకునే మగాడూ ఒక్కడే! కాని ఆ బ్రహ్మ లాంటి మగవాడికి... నచ్చిన ఆడవాళ్ళెందరో!

ఆమె పెదిమలు బిగబట్టింది.

ఇందులో ఆయన తప్పు లేనేలేదు. కాని జరగవలసిన అపకారం జరిగేపోయింది. తప్పు ఎవరిదైనా ఆ తప్పు తాలూకు చేదు ఫలాన్ని అనుభవించవలసి వచ్చేది తాను. అదే ఈ క్షణానికి ఆమె మనసులో ఉన్న నమ్మకం.

"కందువగు హీనాధికము లిందు లేవు
అందరికీ శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల - మింత నొకటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ"

ఆయనే తన అంతరాత్మ అని నమ్ముకుంది తాను. అలాంటి వ్యక్తిని తనకు కాకుండా చేశారు.

ఎవరు వాళ్ళు? తనకి బంధువులా? ఆయనకి బంధువులా? కాదు! అవతలి ఆడమనిషికి బంధువులు.

ఆయన్ని ఫాక్టరీ విషయాల లాలూచీల మీద కార్నర్ చేశారు ఆ ఆడమనిషి బంధువులు. ఆమెను తన కొంప మీదికి తీసుకువచ్చి తన ఇంటినే రెండు ముక్కలు చేశారు.

వేదిక మీద బాసింపట్టు వేసుక్కూర్చుంది జాహ్నవి. పదిహేనేళ్ళ పసి జాహ్నవి. పద్దెనిమిదేళ్ళ పసిడి బొమ్మలా కనిపిస్తోంది. మిగతా గాయనీ గాయకులతో బాటు గొంతు కలిపి పాడుతోంది.

"కడఁగి యేనుగు మీదఁ గాయు ఎండొకటే
పుడమి శునకము మీఁద - బొలము నెండొకటే"

అన్నమయ్య కున్న సమ దర్శకత్వం తన కెక్కడిది? ఆయన జ్ఞాని, యోగి. భగవదారాధనలో శిఖరాగ్ర దర్శనం చేసినవాడు. తనో... పామరురాలు! ఎన్నడూ గుడికి కూడా వెళ్ళదు. వెళ్ళవలసినంత వెళ్ళదగినంత పాప కార్యం తనేమీ చేయలేదు.

ఆమె నిట్టూర్చింది.

తాను పాపం చేయలేదని ఎవరికి తెలుసు? అయినప్పటికీ తాను చెడు ఫలితం అనుభవిస్తోంది.

ఆ రోజింకా తనకి జ్ఞాపకం! ఫాక్టరీ నుంచి ఫోన్ వచ్చింది.

"ప్రతిమా! ప్రతిమా!" ఫోన్‌లో ఆయన గొంతే. పెళ్లయినప్పటి నుంచీ ఆయన పిలుపు అదే!

"ఏమండీ?" అంది తాను.

"ఫాక్టరీ మీద ఇన్‌కంటాక్స్ అధికారులు దాడి చేశారు." ఆయన పిడుగు లాంటి వార్త చెప్పారు.

పేరుకు తగినట్టు ఆమె నిజంగా ప్రతిమే అయిపోయింది. శిలా ప్రతిమ!

"ఎప్పటికప్పుడు లెక్కలు ఒప్పచెప్పడం లేదా!" ఆమె గొంతు పూడిపోయింది.

"కొంత ఆలస్యమయింది".

"ఎంత పని చేశారండీ!"

"ఫరవాలేదనుకో ఇన్‌కం టాక్స్ అధికారులు కొంత గడువిస్తారు. ఆ గడువు లోపల రిటర్న్సు వివరాలివ్వగలను!"

ప్రతిమకు తెలుసు ఆయనకి గొప్ప ఆత్మవిశ్వాసం ఉంది.

"మరీ అంత నమ్మకం పనికిరాదండీ!" అంటుంది తాను.

"నమ్మకమా, ఎవరిమీద? ఎవరి, మీదో కాదు! నామీద నాకే!" అంటారాయన.

పెంకుల ఫాక్టరీ భక్తవత్సలం అంటే ఊరూ వాడా అందరికీ పరిచయమే. ఏం లాభం?

ఇప్పుడు కుంజరం దోమ గొంతులో ఇరుక్కుపోయింది.

ఆ రాత్రి ఆయన చాలా ఆలస్యంగా ఇంటికి వచ్చారు. జుత్తంతా చెదిరిపోయి మనిషి చాలా చికాకుగా ఉన్నారు. వస్తూనే బెడ్ మీద పడిపోయి చాలాసేపటికి వరకూ కళ్లు మూసుకుని ఉండిపోయారు. కళ్లు తెరచి తనవైపు చూసి "జాహ్నవి గుర్తొస్తోంది" అన్నారు.

"వేలీకి వెళ్లాలి! అంది తను.

"అవును. వెళ్లడానికి మనసుంది తీరిక లేదు".

తను నవ్వింది. వేలీకి వెళ్లాలే కాని అటు తర్వాత ఈ భౌతిక ప్రపంచం ఇది కల్పించే ఈత బావులూ, రకరకాల కాలుష్యాలు అస్సలు మనిషికి పట్టవు. ఆ మాటే అంది.

భక్తవత్సలం ఊ కొట్టలేదు. కుదిపి చూసిందామె. భర్త నిద్రకు పడ్డాడు. ఎలా వచ్చిన వ్యక్తి అలా డ్రెస్సయినా మార్చకుండా, బూట్లయినా విప్పకుండా నిద్ర పోతున్నాడు.

ఆయనను లేపకుండా దుస్తులు మార్చింది తను బూట్లు విప్పింది. దీపం ఆర్పి ఆయన పక్కనే నడుం వాల్చింది.

మర్నాటికి గానీ భక్తవత్సలం మామూలు మనిషి కాలేదు. మనిషైతే అయ్యాడు కానీ ఆమె మొహంలోకి చూడలేకపోతున్నాడు. అంతే కాదు. ప్రతిమ ఎదురైతే చాలు తప్పించుకుంటున్నాడు.

ప్రతిమకు సందేహం కలిగింది.

ఆయన కేమయింది? ఆయన ఎందుకు తన నుంచి తప్పించుకుంటున్నారో అర్థం కాలేదు.

ఫ్యాక్టరీకి వెళ్లేముందు ఒకసారి ప్రతిమ మొహంలోకి చూశాడు భక్తవత్సలం.

"నీకు... నీవు..." అన్నాడు.

ఆమె రెప్ప వాల్చింది.

ఆయన గాభరా పడుతున్నారు. ఎక్కడో జరగకూడనిది జరిగింది.

"ఏం జరిగిందండీ?" అడిగింది ప్రతిమ.

ఆయన చెప్పుకొచ్చాడు.

ఇన్కం టాక్స్ అధికారులు దాడి చేయడం నిజమే కానీ, అలా దాడి చేయించినవారు ఎవరో కాదు. భక్తవత్సలం అజమాయిషీని సహించలేని కొంత మంది అధికారులు. వాళ్లు కూడా ఎవరో కాదు. భక్తవత్సలం కింది అధికారులు.

వాళ్లు ఇన్కంటాక్స్ అధికారులను చల్లబరచడానికి ఒక ఎత్తుగడ వన్నారు. వాళ్ళకి కావలసిన ఓ యంగ్ విడో ఉంది. ఆమెను భక్తవత్సలం ఇంట్లో ప్రవేశపెట్టాలి.

ఎలా ప్రవేశ పెట్టాలి? ఆ ఇంట్లో అధికార మున్న వ్యక్తిగా ప్రవేశపెట్టాలి. అంటే భార్యగా ప్రవేశపెట్టాలి. ఆమె వాళ్ళ గుప్పెట్లో మనిషి. అంటే భక్తవత్సలం ఆస్తి కూడా వాళ్ల గుప్పెట్లోనే ఉంటుందన్న మాట.


ప్రతిమ నివ్వెరపోయింది.

ప్రపంచంలో ఇలాంటి కిరాతకాలు కూడా జరుగుతాయా? తన ఇంటినీ, ఆస్తినీ, సగం సగం పంచుకోవడానికి తనకేం అభ్యంతరం లేదు కాని, తన భర్తని ఎలా సగం పంచుకోవడం?

ఆ ఊహే ఆమెకు వికృతంగా తోచింది. అందుకే భక్తవత్సలం చెప్పడం ఆపగానే ఆమె నివ్వెరపోయింది. ఆమెకు కళ్లు తిరిగాయి. శరీరం వివరీతంగా వణికింది.

భక్తవత్సల మే పట్టుకున్నాడు. లేకపోతే ఆమె కింద పడిపోయి ఉండేది.

వారాలూ, నెలలూ గడిచేయి.




ఆమె ఇంట్లోకి వచ్చింది. తను ఊహించిందంతా అయ్యింది. ఇంటినీ, ఆస్తినీ మాత్రమే సగం సగం పంచుకోలేదామె. తన భర్తనూ, తన సమస్త జీవితాన్నీ సగానికి పైగా దోచుకుని, తనకి ఇంటి బాధ్యతనూ, అమాంబాపతు గడ్డు చాకిరీ దఖలుపరచింది.

ఏమీ అనుకోవడానికి లేదు. ఎవర్నీ నిందించడానికి లేదు.

ఆమె తరఫు బంధువులు ఆ ఇంటికి అడపాదడపా వస్తూనే ఉన్నారు. పోతూనే ఉన్నారు. ఆమెదే గుత్త దివత్యం. తమ భార్యాభర్తలిద్దరి జీవితాల మీదా అజమాయిషీని ప్రతి క్షణం ముద్రించి మరీ వెళ్లిపోతున్నారు. ఇటు తన ధర్మపత్నికి అన్యాయం చేస్తున్నాననే చింత. అటు ఫ్యాక్టరీని ఇంకా ఎన్ని చిక్కుల్లో తన ప్రత్యర్థులు ఇరికించబోతున్నారో అనే సంశయం భక్తవత్సలాన్ని నిద్ర పోకుండా చేస్తున్నాయి.

అయితేనేం భక్తవత్సలం మగాడు. మామూలు మగాడు. సమస్యకు లొంగిపోయిన మగాడు.

సమస్య లెవరి కుండవు?

మనిషన్న ప్రతి వాడికీ ఏదో సమస్య ఉండక మానదు. అయితే భక్తవత్సలం దృష్టిలో అతడిదే ఓ పెద్ద సమస్య. అందుకే కట్టుకున్న భార్య కంటే, కన్న కూతురు కంటే సంఘంలో అతడికున్న డబ్బు, అధికారం హోదా అవే ముఖ్యమైపోయాయి. వాటి ముందు ప్రేమ, అభిమానం, వాత్సల్యం అనే పదాలకి విలువే లేకుండా పోయింది.

ఒకనాటి భక్తవత్సలానికీ, ఈనాటి భక్తవత్సలానికీ ఎంత తేడా!

ఆ రోజు అతడి చేతిలో ఎర్రని ఏగానీ లేదు. అయినా తన ప్రేమను దోచుకున్నాడు. అతడి జీవితం తన కోసం అన్నాడు. తను లేకపోతే బ్రతకనే లేనన్నాడు. తను నమ్మింది. నిజానికి అతడా క్షణంలో చెప్పినవన్నీ పచ్చి నిజాలని ఈనాటికీ, ఈ క్షణానికి తన మనసుకి నమ్మకమే!

మరి తేడా ఎక్కడ వచ్చింది? డబ్బు దగ్గర.

తను తన వెంట తీసుకు వచ్చి తన చేతులతో అభిమానంగా అతడి కందించిన తన ఆస్తి పాస్తుల వల్ల ఆమె అతడికి సంఘంలో ఓ స్టేటస్ను ఏర్పరచాయి. అయితే అదే నిలుపుకోవడానికి తననే దూరం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. డబ్బు చేయలేనిదేదీ లేదు.


ప్రతిమ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

ఆ రోజు ప్రతిమ కింకా గుర్తే! ఏ ఆడదీ కలలో కూడా ఊహించనిది ఆమె కళ్ళ ముందే జరిగిపోయింది. ఇంకా ఎందుకు జీవించి ఉన్నాని అని ఏడ్చింది. గుండెలు బాదుకుంది. తల గోడకేసి కొట్టుకుంది. ఆమె ఏం చేసినా జరగాల్సినవి ఆగలేదు. ఆ క్షణంలో ఆమె నోదార్చడానికి మనుషులే కరవయ్యారు.

కానీ తన భర్త?

పట్టు బట్టలతో వెలిగిపోతున్నాడు. నిండు ముత్తయిదువులా రూపం మార్చుకున్న యంగ్ విడో, అదే తన సవతి అతడి పక్కనే తన ఆభరణాలన్నీ ఒంటి నిండా దిగేసుకుని కళకళ లాడిపోతోంది. వారికి ఆ ఇంట్లోనే శోభనం ఏర్పాట్లు చేశారు. నూతన వధూవరులచేత దంపత్తాంబూలాలు ఇప్పించేడు పురోహితుడు. తను ఇన్నేళ్ళూ, ఇన్నాళ్ళూ ఏ గదిలో ఏ భర్తతో కలిసి కాపురం చేసిందో అదే గదిలోకి తన కళ్ళు చూస్తుండగానే మరో ఆతదాన్ని ఆశీర్వదించి మరీ పంపాడు పురోహితుడు.

తన కడుపు మండిపోయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. కాని, ఆ కట్టుదిట్టమైన ఏర్పాట్లలో తను అశక్తురాలుగా మిగిలిపోయింది. పోనీ ఆత్మహత్య చేసుకుందామనుకున్నా తన ఒక్కగానొక్క కూతురు జాహ్నవి కళ్ళ ముందు మెదిలింది. ఆ అమ్మాయి పసితనం, ఆమె చూసే దీనమైన చూపులు గుర్తుకొచ్చాయి. తనలో మాతృప్రేమ పెల్లుబికింది. అదే తనను ఆ ప్రయత్నం నుంచి విరమింపజేయగలిగింది.




"అమ్మగారూ!" అని పిలిచింది మనిషనిషి.

తను తలెత్తి తన పనిమనిషి మొహంలోకి చూడలేకపోయింది.

"అమ్మగారూ! మీకోసం కింద గది ఏర్పాటు చేశాం. మీ సామాన్లన్నీ ఆ గదిలో మార్చేశాం. రండమ్మా!" అంది పనిమనిషి.

నిశ్చేష్టురాలయింది ఆమె

జమీందారిణిలా హుందాగా బ్రతికిన ప్రతిమ క్షణంలో మరోసారి ప్రతిమగా మారింది.

తల దించుకుని దోషిలా తనకు కేటాయించిన దికి పని మనిషి వెనకాలే నడిచి వెళ్ళింది.

తెల్లవారింది. అయితే ప్రతిమ జీవితం అంతకు ముందురోజే తెల్లవారిపోయింది.

ప్రతిమ కళ్ళు మాత్రం తన భర్తగానే ఇంకా భావించుకుంటున్న భక్తవత్సలం కోసం వెతికాయి.

అయితే భక్తవత్సలం అందని కొమ్మే అయ్యాడు. కనిపించని దేముడే అయ్యాడు. ఎప్పుడైనా దూరం నుంచి కనిపిస్తూ ఉంటాడు. అంత దూరంలోనూ తను గమనించగలుగుతూనే ఉంది అతడి కళ్ళలోని చిన్న నీటి పొర. కాని అందువల్ల తనకేం లాభం? తన బ్రతుకు అగాధం అంచులకు ఏనాడో చేరుకుంది. ఇక మిగిలిందల్లా తన జాహ్నవి.

"నామ మొక్కటే - ఈశ్వర నామ మొక్కటే"

అదే లయ బద్ధమైన రాగం, మృదంగం సంగతులు ఒకదాని వెనక ఒకటి క్రమంగా ఆగిపోయి ఓ అద్భుతమైన పారవశ్యంతో శ్రోతలను ఓలలాడిస్తున్న సమయంలో ఏర్పడిన నిశ్శబ్దం ఆమె ఆలోచనలకి ఫుల్ స్టాప్ పెట్టింది.

"అమ్మా! ఇక్కడున్నావా!" అడిగింది జాహ్నవి.

కూతురిని చూసింది ప్రతిమ. ముగ్ధ మనోహరమైన ఆమె మొహంలో కనిపిస్తున్న అమాయకత్వాన్ని చూస్తూ వణికిపోయింది ప్రతిమ.

జాహ్నవి ఆవేశపరురాలు. ఆమెను తమ ఇంట్లో మరో తల్లి వచ్చిందని తెలిస్తే తట్టుకోలేదు.

"రేపట్నుంచి సెలవులమ్మా" అంది జాహ్నవి.

"అవునమ్మా. తెలుసు"

మాట అన్నదే గాని ప్రతిమ తన కూతుర్ని ఎక్కడికి తీసుకువెళ్లాలో ఇంకా నిర్ధారణ చేసుకోలేకపోయింది.

ఇంటికి మాత్రం తన కూతుర్ని తీసుకువెళ్లడం అసంభవం. ఈ సెలవుల్లో తన కూతుర్ని తన పుట్టింటికి తీసుకువెళ్లాలి.

హాల్లోంచి పిల్ల లందరూ క్రమశిక్షణతో బయటికొస్తున్నారు. అన్నమాచార్య కీర్తన పాడినప్పుడు ఎటువంటి నిశ్శబ్దం పాటించారో, ప్రార్థనా మందిరం నుంచి తిరిగి వెళ్ళేటప్పుడూ అదే నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు.

"హాస్టలుకి వెళదామమ్మా" అంది జాహ్నవి.

ప్రతిమ తనలో తాను నవ్వుకుంది. తన కూతురికి తమ ఇంట్లో చెలరేగుతున్న జ్వాల సెగ తగల్లేదు. ఆ సెగ తగలక ముందే తన పుట్టింటికి జాహ్నవిని తీసుకువెళ్లాలి.

"హాస్టలుకి వెళ్ళి బట్టలు సర్దుకుని మనం తాతయ్య గారింటి వెళ్ళిపోదాం అమ్మా!" అంది ప్రతిమ.

జాహ్నవి మాట్లాడలేదు. ఎందుకని అడుగలేదు.

ఇద్దరూ హాస్టలుకి వెళ్లారు. బట్టలు సర్దుకునే ప్రయత్నాలేవీ చెయ్యటం లేదు జాహ్నవి.

ప్రతిమ ఆశ్చర్యంగా ఉంది. రేపట్నుంచి మెస్ ఉండదు.

ఆ వేలీలో ఎటు చూసినా తొమ్మిది కిలోమీటర్ల దూరం లోపు ఏ వస్తువూ దొరకదు.

ఇటువంటి పరిస్థితుల్లో వేసవి సెలవులను తన కూతురితో ఎలా గడపడం?

జాహ్నవి తల్లిని సమీపించి. మెడ కావిలించుకుని ఏడుస్తోంది.

ప్రతిమకి మతిపోయింది. జాహ్నవి ఎందుకేడుస్తోంది? వేలీ స్కూలునీ అక్కడి ప్రశాంత ప్రకృతినీ వదిలి పెట్టలేక ఏడుస్తోందా జాహ్నవి?

అందుకేనా జాహ్నవి ప్రయాణం ఏర్పాట్లు చేయడంలేదు?

కూతురు ఏడుస్తుంటే తల్లికి నోటి వెంట మాట రాలేదు.

ఆమె గొంతులోంచి మౌనంగా శోక సముద్రం ఉప్పొంగుతోంది. పావుగంటలో తల్లీ కూతుళ్లు కన్నీళ్లతో ఒకర్నొకరు ఓదార్చుకున్నారు.

ఎవరో చేసిన తప్పు. ఎక్కడో జరిగిన అపచారం. మరెక్కడో వేసిన తప్పటడుగు.

ఇంతకు ముందే చెప్పినట్లు తప్పులు ఎవరు చేశారన్నది ప్రశ్న కాదు. ఆ తప్పుల ఫలితాల్ని ఎవరు అనుభవిస్తున్నారన్నదే ముఖ్యం.

"మనం ఇక్కడే ఉండిపోదా మమ్మా! ప్రిన్సిపాల్ గార్నీ డైరెక్టర్ గార్నీ రిక్వెస్ట్ చేశాను. మనకి ప్రత్యేకంగా మెస్ ఉంటుంది."

కూతురేం మాట్లాడుతుందో తల్లి కర్థం కాలేదు.

"తాతయ్య గారి ఇంటికి మనం వెళితే అక్కడ సంగతంతా టామ్‌టామ్ అవుతుందమ్మా!"

"ఏ సంగతి?" ప్రతిమ గొంతు వణుకుతోంది.

"నిన్ను ఇక్కడే ఉంచమని నాన్నగారు రాశారమ్మా!"

ఎక్కడో జలపాతం విరుగుతోంది.

కొండలు పెళేలుమంటున్నాయి.

అణువును ఛేదించుకొని ప్రళయ మారుతాలు విజృంభిస్తున్నాయి.

కాని వాటి ఫలితం ప్రస్తుతం ప్రతిమ అనుభవిస్తోంది.★

## హాస్యం

సర్వరోగ పీడితు లందరికీ ఏకైక దివ్యౌషధం హాస్యం ఒక్కటే! నవ్వు నాలుగు విధాల స్వీటు అన్నది నేటి నిజం! ముఖ్యంగా చిరునవ్వు మానవుల్లో చైతన్యాన్ని కలిగించి ఉత్సాహాన్ని కలుగజేస్తుంది. ఎటువంటి దీర్ఘరోగ బాధితులైనా హాస్యం నీడలో సేద తీర్చుకోగలుగుతారు. జీవితపథంలో దీని విలువ అమూల్యం, అద్భుతం! అమాయకత్వంతో కూడిన చిరునవ్వు సౌందర్యాన్ని ఆకర్షవంతం చేయగలదు. ఇది సామరస్యాన్ని సౌజన్యాన్ని పెంపొందిస్తుంది. విజ్ఞానాన్ని రంజింపచేస్తుంది. ఆరోగ్యాభివృద్ధితోబాటు ఆయుష్షును పెంపొందిస్తుంది. దారిద్ర్యాన్ని బాధల్ని తీరుస్తుంది. కురూపులలో అయినా సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది. జీవితానికి సరళత్వాన్ని, శాంతిని, సౌఖ్యాన్ని ఆనందాన్ని ఆపాదిస్తుంది.

భోగా శ్రీనివాసమూర్తి [హైదరాబాదు]

